క్లుప్తంగా

విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరి



పామర్రు: రైతులందరూ ఈ నెల 28వ తేదీ లోపు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు (ఫార్మర్ రిజిస్ట్రేషన్) తప్పనిసరిగా చేయించుకోవాలని, లేని పక్షంలో వారికి నగదు జమ కాదని ఏడీఏ బి.స్వర్ణలత పేర్కొన్నారు. మండలంలోని పామర్రు, కొమరవోలు, కురుమద్దాలిలో ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై రైతులకు అవగాహన సదస్సులను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సొంత పొలం ఉన్న రైతులు పొలం పాస్ బుక్, ఆధార్, ఫోన్ నంబరును తీసుకుని ఆర్ఎస్‌కే వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ శివనాగరాణి పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: రైతులు తమ విశిష్ట గుర్తింపు నంబర్‌ను నమోదు చేయించుకోవాలని ఏఓ ఎల్.సునీల్ పిలుపునిచ్చారు. ఈ విషయమై విన్నకోటలో రైతులకు సోమవారం అవగాహనా కార్యక్రమాన్ని చేపట్టారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు

కూచిపూడి(మొవ్వ): వచ్చే నెల ఒకటి నుంచి 20వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్ష ప్రశ్నపత్రాలు సోమవారం కూచిపూడి పోలీస్ స్టేషన్లో భద్రపరిచారు. మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో నిర్వహించే పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు సెట్-3 పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ఎం సుబ్రహ్మణ్యం ఆదేశాలతో హెచ్‌సీ మోహనరావు జూనియర్ కళాశాల సీఎస్ డి సుధాకర్, డీఓ గంగాధర్ పర్యవేక్షణలో భద్రపరిచారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



పామర్రు: కరాటే రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్ పోటీల్లో తమ విద్యార్థులు విజేతలుగా నిలిచారని అసీస్సీ హైస్కూల్ ప్రిన్సిపాల్ వలసా సబాస్టియన్ తెలిపారు. స్థానిక అసీస్సీ హైస్కూల్‌లో విజేతలను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరాటే కటా క్రేన్ విభాగంలో పి.శ్రీ చందన, కె.భవిష్య, ఎన్.సాత్విక్, కె.భవ్య, కె.నిహంత్ ప్రథమస్థానం సాధించగా కె.హవీష్ , గౌతమ్‌లు ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు. కరాటే స్నేక్ విభాగంలో రేష్మ ప్రథమ, ఉజ్వల ద్వితీయ స్థానం సాధించారన్నారు. ఫోర్ షోలన్ విభాగంలో జిన్సీ ప్రథమ స్థానం సాధించారని తెలిపారు.

ఓటర్ లిస్టులో తప్పులు సరిచేయాలి

మొవ్వ: ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ లిస్టులో ఉన్న తప్పిదాలు సరిచేయాలంటూ ప్రజా సంఘాల నాయకుడు శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని 167వ బూత్‌లో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్నాయని(సీరియల్ నంబర్ 138,139) అలాగే అదే బూత్‌లో మరో వ్యక్తికి మూడు ఓట్లు (సీరియల్ నంబర్ 327,328,330) ఉన్నట్లు తెలిపారు. ఈ తప్పులను వెంటనే సరిచేయాలని అధికారులను కోరారు.

చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



కైకలూరు: రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ఆటపాక హోలీక్రాస్ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని వీరమల్లు రచన శ్రీతేజ సీనియర్స్ విభాగంలో మూడో బహుమతి సాధించింది. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి కేకేఆర్ హ్యాపీ వ్యాలీ స్కూల్లో ఫ్యూచర్ అండ్ నేచర్ అనే అంశంపై చిత్రలేఖన పోటీలు ఆదివారం నిర్వహించారు. మూడో బహుమతిగా రూ.5,000 నగదు, ప్రశంసా పత్రం అందించారు. సోమవారం పాఠశాల్లో ఆ విద్యార్థినిని సిబ్బంది అభినందించారు.

పారిశ్రామిక పరిజ్ఞానం అవసరం



గుడివాడ టౌన్: విద్యార్థులకు ప్రయోగాత్మక పరిజ్ఞానం ఎంతో అవసరమని ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ అన్నారు. సోమవారం ఏఎన్నార్ కళాశాల విద్యార్థులు జోకిపర్రులోని జోసిల్ లిమిటెడ్ కంపెనీలో పారిశ్రామిక సందర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశాలు ఎంత అవసరమో ప్రయోగాత్మక పరిశీలన కూడా అంతే అవసరం అన్నారు. కంపెనీ మేనేజర్ బెనర్జీ పాల్గొన్నారు.

ఒకేచోట కొలువైన దేవతామూర్తులు

- మహా శివరాత్రికి ప్రత్యేక పూజలు
- సిద్ధేశ్వరాలయానికి రెండున్నర శతాబ్దాల చరిత్ర



నవగ్రహాల ఆలయం



సిద్ధేశ్వరాలయం

ఉత్సవమూర్తులు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులోని శ్రీమత్ గంగా, పార్వతీదేవి సమేత సిద్ధేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో పలు దేవతామూర్తులు కొలువై ఉన్నారు. ఈ ఆలయంలో బుధవారం శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ఆలయానికి శతాబ్దాల చరిత్ర ఉంది. 1745 సెప్టెంబరు 29న గురజ జమీందారు కమాదున అయ్యన్న శివ లింగ రూపాన్ని ప్రతిష్ఠించి, ఆలయాన్ని నిర్మించారని పెద్దలు తెలిపారు. స్వామివారి దీప, ధూప నైవేద్యాల నిమిత్తం 16ఎకరాల పొలాన్ని కూడా అప్పట్లో రాసిచ్చారు. ఈ ఆలయాన్ని వందేళ్ల తర్వాత చాపరాల భూపతిరాయుడు పునః ప్రతిష్ఠ చేశారు. కాలక్రమంలో ప్రధాన ఎంఎన్‌కే రహదారి ఎత్తు పెంచేసరికి, రోడ్డు కంటే ఆలయం పల్లపు ప్రాంతంగా మారింది. స్వామిని దర్శించుకోవాలంటే భక్తులు గోతిలోకి దిగి దర్శించుకోవాల్సిన పరిస్థితి ఉండేది.



కల్యాణమండపం

ఉత్సవాలు

గుడ్లవల్లేరు సిద్ధేశ్వర స్వామిఆలయంలో ఈ నెల 26న శివరాత్రిని పురస్కరించుకుని ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కొసరాజు వెంకటాద్రిచౌదరి తెలిపారు. బుధవారం ఉదయం నాలుగు గంటల నుంచి గోపూజ, స్వామికి అభిషేకాలు, రుద్రాలంకృత మహారుద్ర లింగేశ్వరునికి రుద్రాభిషేకం, దీపోత్సవం, స్వామివారి శాంతి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సోమనాథ మహర్షిచే పునః ప్రతిష్ఠ

పాతికేళ్ల క్రితం గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు ఉత్సవ కమిటీ చైర్మన్‌గా నడుం బిగించి, గ్రామస్తుల సహకారంతో సిద్ధేశ్వరుని శివ లింగాన్ని సోమనాథ మహర్షిచే పునః ప్రతిష్ఠ చేయించారు. అప్పట్లోనే సిద్ధేశ్వరుడు, పార్వతీదేవి, వీరభద్రునికి చెందిన ప్రధాన గర్భాలయాలతో పాటు గుడిని నిర్మించారు. వీటితో పాటు నవగ్రహాలు, విఘ్నేశ్వర స్వామి, కుమారస్వామి, అయ్యప్పస్వామి, ఆంజనేయస్వామి, సాయిబాబా ఉపాలయాలను నిర్మించారు. అనంతరం కల్యాణ మండపాన్ని నిర్మించారు. ఈ ఆలయానికి వచ్చే భక్తులు దేవతామూర్తులను దర్శించుకుంటూ భక్తి తన్మయత్వంలో తరిస్తున్నారు.

ఉపాలయాలను నిర్మించారు



సిద్ధేశ్వర స్వామివారికి వందల ఏళ్ల చరిత్ర ఉంది. ఈ ఆలయానికి వందేళ్ల తర్వాత చాపరాల భూపతిరాయుడు పునః ప్రతిష్ఠ చేశారు. పాతికేళ్ల క్రితం రోడ్డు కంటే శివాలయం పల్లపు ప్రాంతంలో ఉండటంతో కొత్తగా ఆలయభివృద్ధితో పాటు ఉపాలయాలను నిర్మించారు.

– వల్లభనేని వెంకట్రావు, గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం విద్యా సంస్థల చైర్మన్

నిత్య ధూప, దీప నైవేద్యాలు



స్వామివారికి నిత్యం ధూప, దీప నైవేద్యాలు అందుతున్నాయి. దేవదాయ శాఖ ద్వారా నిర్వహిస్తున్న ఈ ఆలయానికి ముఖ్యంగా మహా శివరాత్రికి భక్తులు తండోపతండాలుగా వస్తుంటారు. స్వామికి గ్రామస్తుల సంయుక్త సహకారంతో నిర్వహించే పూజాధికాలను తిలకించేందుకు భక్తులు మక్కువ చూపుతూ...జాగారాలు చేస్తారు.

– వి.డి.డి.ప్రసాద్, ఆలయ ఈఓ

కంకిపాడు రోడ్డు పనులు ప్రారంభం



గుడివాడ టౌన్: గుడివాడ-కంకిపాడు రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. భవిష్యత్ భద్రతాదళం సభ్యులు, ప్రజల పోరాటం ఫలితమే పనులు ప్రారంభమయ్యాయని భవిష్యత్ భద్రతాదళం వ్యవస్థాపకుడు వై.వి. మురళీకృష్ణ సోమవారం తెలిపారు. మొత్తం 21 కిలోమీటర్ల పనులు పూర్తయ్యేవరకు భవిష్యత్ భద్రతాదళం పనిచేస్తూనే ఉంటుందని, ప్రజల సౌకర్యార్థం ఈ పనులు ప్రారంభానికి స్పందించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ధన్యవాదాలు తెలిపారు.

మంచి, చెడు స్పర్శలను గుర్తించాలి

కైకలూరు: విద్యార్థులు మంచి, చెడు స్పర్శలను గుర్తించే పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలని పట్టణ సీఐ పి.కృష్ణ పేర్కొన్నారు. టౌన్ పరిధిలోని ఉన్నత పాఠశాలలు, జూనియర్ కాలేజీలో విద్యార్థులకు పోలీసు చట్టాలు, అభయ వాహన సేవలపై సోమవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ కచ్చితంగా ధరించాలన్నారు. పట్టణ ఎస్ఐలు డి.వెంకట్‌కుమార్, ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ బాలికలపై వేధింపులు జరిగితే 95503 51100కు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

డ్వాక్రా సంఘాలకు ఆర్థిక చేయూతే లక్ష్యం

పామర్రు: డ్వాక్రా సంఘాలకు ఆర్థిక చేయూతను అందించడమే లక్ష్యంగా యూనియన్ బ్యాంక్ సేవలను అందిస్తోందని ఆ బ్యాంక్ డెప్యూటీ రీజినల్ హెడ్ తాతాజీ పేర్కొన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రా సంఘాల సభ్యులకు రుణాలపై అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంక్ ఇచ్చే రుణాలతో స్వయంగా వ్యాపారాలు చేయడం, పశువులు, కోళ్ల పెంపకం తదితర కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని లబ్ధి పొందాలన్నారు. అనంతరం 20 డ్వాక్రా సంఘాల గ్రూపు సభ్యులకు రూ.1.20 కోట్ల చెక్కును అందజేశారు. పామర్రు బ్రాంచ్ మేనేజర్ దుర్గాప్రసాద్, వెలుగు సీసీ స్వప్నమణి పాల్గొన్నారు.



డ్వాక్రా సంఘాల సభ్యులకు రుణాల చెక్కును అందజేస్తున్న బ్యాంక్ డెప్యూటీ రీజినల్ హెడ్ తాతాజీ

అసెంబ్లీలో అగ్రిగోల్డ్ సమస్యను లేవనెత్తండి

కైకలూరు: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లేవనెత్తాలని కైకలూరు అగ్రిగోల్డ్ అసోసియేషన్, కలిదిండి మండల అధ్యక్షుడు చక్కా జగన్‌మోహన్‌రావు కోరారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ 10 సంవత్సరాల నుంచి అగ్రిగోల్డ్ బాధితులు రోడ్డెక్కి నిరసనలు, ధర్నాలు, నిరాహార దీక్షలు చేస్తున్నారన్నారు. అగ్రిగోల్డ్ భూముల్లో ఉన్న విలువైన ఎర్ర చందనం, టేకు, జామాయిల్ ఖరీదైన వృక్ష సంపదను కొందరు నరికి సొమ్ము చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బాధితులు దాచుకున్న డబ్బులను న్యాయ మైన వడ్డీతో కలిపి ఇవ్వాలని కోరారు.



జగన్ మోహన్ రావు

4 నుంచి వీకేఆర్ ఫెస్ట్-2025

గుడివాడ టౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో వీకేఆర్ ఫెస్ట్-2025 నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు తెలిపారు. మంగళవారం కళాశాల ఆడిటోరియంలో ఫెస్ట్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మార్చి 4, 5 తేదీల్లో కళాశాల ఆధ్వర్యంలో ఈ ఫెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఫెస్ట్‌లో ఫుడ్, యాక్టివ్ స్టాల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలోని అన్ని ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు ఈ ఫెస్ట్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 94915 85714లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ కల్యాణ్‌కుమార్, అడ్వకేట్ కై కాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

సబ్‌జోన్ ఆటల పోటీల్లో 'అక్షర' ప్రతిభ

ముదినేపల్లి రూరల్: మండలంలోని వడాలి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన దాసు అక్షర ఇటీవల నిర్వహించిన సబ్‌జోన్ క్రీడల పోటీల్లో ప్రతిభ చూపి బంగారు పతకం, ప్రశంసా పత్రం అందుకున్నట్లు హెచ్‌ఎం వి.ప్రభుదాస్, ఉపాధ్యాయుడు సీహెచ్ నాగమల్లేశ్వరరావు తెలిపారు. వడాలి హైస్కూల్‌కు చెందిన అక్షర లాంగ్‌జంప్ పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. బంగారు పతకాన్ని, ప్రశంసా పత్రాన్ని సోమవారం విద్యార్థినికి సోమవారం అందజేశారు. అక్షరను పీడీ వి.భాస్కరరావు, ఉపాధ్యాయుడు నరసింహారావును అభినందించారు.



హెచ్‌ఎం నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న అక్షర

పట్టభద్రుల ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

కైకలూరు: ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. మంగళవారంతో ప్రచారపర్వానికి తెరపడనుంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో కై కలూరు నియోజకవర్గం జిల్లాల పునర్విభజనలో భాగంగా ఏలూరు జిల్లాలో చేరింది. ఇప్పటికే గుంటూరు నుంచి 12, పల్నాడు జిల్లా నుంచి 4, బాపట్ల జిల్లా నుంచి 1, ఎన్టీఆర్ జిల్లా నుంచి 5, కృష్ణా జిల్లా నుంచి 2, ఏలూరు జిల్లా నుంచి 1 మొత్తం కలిపి 25 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. కైకలూరు నియోజకవర్గం ముదినేపల్లి మండలం శ్రీహరిపురానికి చెందిన తిరువీధుల శారద పోటీలో ఉన్నారు.

కైకలూరు నియోజకవర్గంలో..

కైకలూరు నియోజకవర్గ విషయానికి వస్తే మొత్తం 8 పోలింగ్ బూత్‌లలో 27వ తేదీ ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. నియోజకవర్గం మొత్తం మీద 6,447 పట్టభద్రుల ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

బ్యాలెట్ పేపరు విధానం

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తిగా బ్యాలెట్ పేపరు విధానంలోనే ఉంటాయని అధికారులు తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను, నియమ నిబంధనలను అభ్యర్థులు కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు.

గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు

కైకలూరు: నియోజకవర్గంలోని పలు డ్రెయిన్లలో గుర్రపుడెక్క, కిక్కిస, పూడిక పనులకు పొక్లయిన్‌తో నిరంతరం పనులు చేయిస్తామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. కలిదిండి మండలం తాడినాడ పుల్లవ డ్రెయిన్‌లో డీసీ సంఘం, కమిటీ సభ్యులు కలిసి పంటిపై యంత్రంతో డెక్క తొలగింపు పనులను కామినేని సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఏటా తుపానుల సమయంలో డ్రెయిన్లు పొంగి లోతట్టు గ్రామాలను ముంచెత్తుతున్నాయన్నారు. డీసీ చైర్మన్లు కమిటీ సభ్యులు, రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఆయా పరిధిలోని డ్రెయిన్లను బాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్లు, కూటమి నేతలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే పై ఓవర్ పనుల్లో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి కోసం మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ జీబీ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో ప్రధాన సెంటర్‌లోని జగం మిల్క్ పార్లర్ వద్ద వేసవిని పురస్కరించుకుని పాదచారులు, వాహన చోదకులను దృష్టిలో పెట్టుకుని చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో దాత మూల్పూరి సుధాకర్, లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ, లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వై.పి.సి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రామలింగేశ్వర స్వామి కల్యాణ వేడుకలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని గురజ గంగా పార్వతీసమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి శివరాత్రి వేడుకలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. పురాతన ఆలయంగా పేరుగాంచిన ఈ ఆలయంలో మంగళవారం నుంచి గురువారం వరకు స్వామివారి కల్యాణమహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

పారిశుద్ధ్య చర్యలకు శ్రీకారం

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో పారిశుద్ధ్య చర్యలను గ్రామ పంచాయతీ ముమ్మరం చేసింది. గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంపై డీపీఓ అరుణ గత ఆదివారం ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి రవికుమార్ పారిశుద్ధ్య చర్యలకు సోమవారం ఉపక్రమించారు. జేసీబీని ఏర్పాటు చేసి తోట్లవల్లూరు-ఉయ్యూరు ప్రధాన రహదారి వెంట చెత్త, వ్యర్థాల తొలగింపు పనులకు శ్రీకారం చుట్టారు.


ఘనంగా ఆలయ వార్షికోత్సవం

రాపర్ల(పామర్రు): గ్రామంలోని వీరాంజనేయ స్వామి ఆలయ తొమ్మిదో వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామికి అభిషేకాలను చేశారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాద వితరణ నిర్వహించి, అన్న ప్రసాదాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కాకర్ల వీర ప్రభాకరరావు, కాకర్ల రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

శివరాత్రికి సర్వం సిద్ధం



ముస్తాబైన ఐలూరులోని రామేశ్వరస్వామి ఆలయం



జొన్నపాడులో ముస్తాబైన కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం

తోట్లవల్లూరు: దక్షిణ కాశీ ఐలూరులోని శ్రీగంగా పార్వతీ సమేత శ్రీరామేశ్వరస్వామి ఆలయం శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. వివిధ ప్రాంతాల నుంచి పుణ్యస్నానాల కోసం తరలివచ్చే అశేష భక్త జనవాహిని కోసం అధికార యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 26న జరగనున్న మహా శివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధమైంది. శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని సుమారు లక్ష మందికిపైగా భక్తులు స్థానిక కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి, పితృ దేవతలకు పిండ ప్రదానాలు చేస్తారు. అనంతరం స్థానిక రామేశ్వరస్వామిని, పక్కనే ఉన్న రఘునాయకస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తారు. భక్తుల సౌకర్యార్థం ఉయ్యూరు, మచిలీపట్నం నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది.

జల్లు స్నానాల ఏర్పాటు

కృష్ణానదిలో నీరు లేనందున అధికారులు జల్లు స్నానాలు ఏర్పాటు చేస్తున్నారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక వసతి, తాగు నీటి కోసం మంచినీటి పంపులు, నీడ కోసం షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు. ఏర్పాట్లను ఎంపీడీఓ కెఎస్ రవికాంత్,గుడివాడ డీఎస్పీ ధీరజ్, పమిడిముక్కల సీఐ చిట్టిబాబు, ఎస్ఐ అవినాష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ సుబ్బారావు, ఎస్ఐ అవినాశ్, ఆలయ మేనేజర్ శివగోపాలరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు పర్యవేక్షిస్తున్నారు.

ఆలయాల ముస్తాబు

నందివాడ: ఈ నెల 26న శివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. స్థానిక జనార్దనపురంలోని విశ్వేశ్వరస్వామి ఆలయానికి రంగులు దిద్ది సుందరంగా అలంకరించినట్లు ఆలయ ఈఓ కాటి వెంకట లక్ష్మి తెలిపారు. బుధవారం సాయంత్రం స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలగంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు.

రేపు శాంతి కల్యాణం

కాజ(మొవ్వ): మొవ్వ మండలం కాజ గ్రామంలోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర దేవస్థానంలో మహా శివరాత్రిని పురస్కరించుకుని బుధవారం శాంతి కల్యాణం నిర్వహించనున్నట్లు భక్తి మండలి సభ్యులు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు జరిగే శాంతి కల్యాణంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని నిమ్మగడ్డ బాలకృష్ణశాస్త్రి, మామిళ్లపల్లి శ్రీనివాసశర్మ కోరారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

కొండిపర్రు(పామర్రు): మండలంలోని కొండిపర్రు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థి, ఎన్ఆర్ఐ గుజవర్తి రామకృష్ణారెడ్డి సోమవారం ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం మల్లికార్జునరావు మాట్లాడుతూ 2023-24 సంవత్సరంలో 7వ తరగతిలో ప్రథమ స్థానం సాధించిన కూసం సాయి సందీప్‌రెడ్డి, ద్వితీయస్థానం సాధించిన ఆవుల దేవీ ప్రియలకు ఒక్కొక్కరికి రూ.3వేల చొప్పున మొత్తం రూ.6వేలను ప్రోత్సాహకంగా అందజేసినట్లు తెలిపారు. ఎస్ఎంసీ చైర్మన్, కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు కోటిరెడ్డి, ఉపాధ్యాయుడు ధనరాజ్ పాల్గొన్నారు.



నగదు బహుమతులను అందజేస్తున్న పూర్వ విద్యార్థి రామకృష్ణారెడ్డి

అంగన్‌వాడీలకు శిక్షణ

మండవల్లి: జ్ఞానజ్యోతి శిక్షణలో భాగంగా మండవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈసీసీఈ సామాజిక కార్యక్రమాలు, పాఠశాల సంసిద్ధత మేళాపై సోమవారం శిక్షణ ఇచ్చారు. శిక్షకులుగా రూప్‌కుమార్, సూఫియన్, రాజేష్ వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రసాద్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

అన్నదానం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవా భవన్‌లో సోమవారం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పొట్లూరి రవి, లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ, లయన్స్ ప్రతినిధులు జంగం మోహనరావు, సూరపనేని పరంధామయ్య పాల్గొన్నారు.

తొమ్మిది గ్రామాల్లో రీ సర్వే పూర్తి

నందివాడ: మండలంలో మొదట విడతకు సంబంధించి 23 గ్రామాలు ఉండగా తొమ్మిది గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తయిందని తహసీల్దార్ గురుమూర్తిరెడ్డి తెలిపారు. మండలంలో 12 సచివాలయాలు ఉన్నప్పటికీ ఎనిమిది మంది వీఆర్ఓలు మాత్రమే పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఖాళీలను భర్తీ చేయించాలని అధికారులకు నివేదిక అందజేశామని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన



గుడివాడరూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు తగు జాగ్రత్తలు పాటించాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు సూచించారు. మండలంలోని మల్లాయపాలెం అడ్డరోడ్డు వద్ద ఆటో డ్రైవర్లు, వాహనదారులు, పలు కళాశాలల విద్యార్థినులకు సోమవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఆటోలు, ద్విచక్ర వాహనాలు అతివేగంగా నడపకూడదన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.